



# కాసిన వెన్నెల 'శివారం'

వరసగా వారం రోజులు ప్రాణం విసిగేట్లు ఆఫీసులో పనిచేసిన సీతారామయ్య ఆదివారం అంటే స్కూలు విద్యార్థిలాగ ఎగిరి గంతులేస్తాడు. అందులో ఆ ఆదివారంనాడు ఏదైనా వుల్లాసకరమైన చిత్రం చూడటంగాని, ఉత్తమగ్రంథం చదవటంగాని జరిగితే ఏదో నూతన శక్తితో వచ్చేవారం అంతా గడిపి వెయ్యకల్గుతాడు.

సీతారామయ్యని మీరు ఎక్కడోఅక్కడ చూసేవుంటారు. ఒకే సాదాబట్టలు వేసుకుంటాడు. పత్రికలు అమ్మే దుకాణం ముందు ఆగి, పత్రిక కొనేముందు అన్ని పత్రికలహెడ్‌లైన్సు ఒకసారిచూసి కొంచెం ఆలోచించి, ఆఖరికి ఎక్కువ పేజీలున్న పత్రికే ఆరోజున కొంటూవుంటాడు. ఎంత వర్షంవచ్చినా, ఎండకాసినా చేతిలో గొడుగు వుండదు. జేబురుమాలుతోనో న్యూస్‌పేపర్ తోనో పని గడుపుకోగల్గ సమర్థుడు. ఒక పక్కన 'హీల్' అరిగిపోగా, మళ్ళీ 'హీల్' వేయిస్తే, అది మళ్ళీ అరిగితే, యింకా మళ్ళీ 'హీల్' వేయించనని ప్రతిజ్ఞ పట్టి, ఎంత ఎండాకాలంలోనైనా ఆ అరిగిన చెప్పులతోనే కాలాన్నిదొర్లించగల ప్రతిభావంతుడు. పొద్దున్నే ఇంట్లో కాఫీ తాగి, పత్రికకోసం బయటికివచ్చి, ఆకలివేసినా వెయ్యకపోయినా, కాఫీహోటలు కన్పిస్తే లోపలదూరి, దాగుండదని ఓ జత యిడ్లీతిని కాఫీ తాగి బయటపడే నిసలైన ఆంధ్రుడు. హోటల్‌లోనుంచి బయటికి రాగానే, నోరు దాగుండలేదని ఓ అర్ధణా పెట్టి వక్కపొడి కొనుక్కుని, మరంత డబ్బుతో ఓ సిగరెట్ కొనుక్కుని, పొగవదుల్తూ రోడ్డుమీది విచిత్రాలు చూసుకుంటూ, తనలో తనే నవ్వుకుంటూ పోతూంటాడు. సీతారామయ్యని పోలీసులు పేవ్‌మెంట్ మీదకి నడవమని బెదిరిస్తారు. పేవ్‌మెంట్ మీది 'హాకర్సు' కిందకి పొమ్మని నిందిస్తారు, రోడ్డుమీద రిక్షావాళ్ళు కళ్ళు తెరుచుకుని నడవమని శాసిస్తారు. లారీలవాళ్ళు అతన్ని దూసుకుని పోతుంటారు. కార్లవాళ్లు బురద చిమ్ముకుంటూ పోతారు, లెప్పర్స్, ఇతర 'బెగ్గర్స్' పైసాయే రాల్చేడని తిట్టుకుంటారు. ఇప్పటికైనా గుర్తుపడితే శుభం! కథ ప్రారంభిద్దాం.

ఆ ఆదివారం సీతారామయ్య ఒక మిత్రుడి కోసం, చూసిచూసి విసుగెత్తి, యింక కాలాతీతం అవుతుందని సినిమాకి బయలుదేరాడు. బయలుదేరేడన్న మాటేగాని లోపల మిత్రుడు రాలేదే అని విచారంగానే వుంది కాని ఏంచేస్తాడు. ఆలస్యంచేస్తేటిక్కెట్లు కూడా దొరకవు. అప్పటికే అయిదున్నర దాటింది. హడావిడిగా ఇంట్లోంచి బయటికొచ్చి అటూయిటూ చూసేడు. ఎక్కడా ఒక రిక్షా అయినాలేదు. మరో నాలుగు అడుగులు వేసి అటుయిటు చూసేడు. స్టేషను నుంచి వచ్చే జనం సామాన్లు తమ నెత్తిన పెట్టుకునో, కూలీల నెత్తినపెట్టో పాదయాత్ర చేస్తున్నారు. ఏమిటి సంగతని విచారించాడు. ఆ దినం ఆగస్టు 15 గనక రిక్షాలు నడవవు,



అని చెప్పేరు. సీతారామయ్య స్వాతంత్ర్య ఉత్సవ సందర్భంలో ఆంధ్రుల అకుంఠిత దేశభక్తికి మురిసిపోతూ త్వర త్వరగా పాదయాత్ర సాగించి సినిమాహాలుకు చేరుకున్నాడు.

సినిమాహాలుకు చేరుకున్న సీతారామయ్య అక్కడి దృశ్యాన్ని చూసి తన కళ్ళను తానే నమ్మలేక పోయేడు. రూపాయి కౌంటర్‌వద్ద వుండే క్యూ రోడ్డు మీద S ఆకారంలో ట్రాఫిక్‌ను ఆపేసే స్థితిలోవుంది. టైంచూచుకున్నాడు. టైం ఆరు అవుతోంది. ఇంకో అరగంటలో ఆట మొదలుపెడతారు. ఆకాశంవంక చూసేడు. మబ్బులు నల్లగా ముసురుకుని వస్తున్నాయి నలుమూలల్నుంచి. చల్లటిగాలి జివ్వున వేస్తోంది. కాస్సేపట్లో వర్షం తప్పదు. అట్టే ఆలోచనతో టైం వృధా చెయ్యక 1.50 కౌంటర్ వద్దకి వెళ్ళాడు. అక్కడ 15.20 మంది మాత్రం వుంటారు. ఫోతేపోయింది, అనుకుంటూ 1.50 క్యూలో నిలబడ్డాడు సీతారామయ్య. వెంటనే తన తాహతుకి 1.50 టికెట్ ఏమిటి అనుకున్నాడు. ఇవ్వాళ 1.00 టికెట్ యింపాసిబుల్. ఇంటికి వెళ్ళిపోవలసిందే. సినిమా మంచిదికనుక రేపు అయినా తిరిగివచ్చి చూడాలి. రేపు వస్తే రిక్షాలు వుంటాయి.రానుపోను అర్ధరూపాయి అయినా యివ్వాలి. అది యివ్వాళ రిక్షాకి యిచ్చేననుకుని 1.50 కొనుక్కుంటే ఏం? అని సరిపెట్టుకున్నాడు మనస్సుని. పైగా తనకంటే తక్కువజీతం సంపాదిస్తున్న గుమాస్తాల మొహాలు 1.00 క్యూలో వుండటం చూసేడు. వాళ్ళే 1.00 కి రాగా, తను యీ వక్కసారికే 1.50 కి పెడ్తే ఏం? అనుకున్నాడు. వెనక్కి చూసేడు. తనవెనక ఎవరైనా వున్నారేమోనని. అప్పటి కప్పుడే తన వెనక హైస్కూల్ హెడ్‌మేష్టర్ చేరాడు. ఆయన వెనక యింకో పాతిక మంది చకచకా మిలిటరీ సిపాయిల్లా లైనులో నిలబడి పోతున్నారు. తను ఒక్క ఐదు నిమిషాలుముందు రాబట్టి సరిపోయింది గాని. లేకపోతే ఆ పాతికమందికి వెనక నిలబడవలసి వచ్చేవాడు. ఇప్పుడు తనకి గ్యారంటీగా టికెట్ దొరికి తీరుతుంది అనే ఆలోచన ఎక్కడలేని వుత్సాహాన్ని యిచ్చింది. సినిమాహాలు గడియారం ఆరు గంటలు కొట్టింది. టిక్కెట్లు యివ్వడం ప్రారంభించేడు. కౌంటర్‌లోని పెద్దమనిషి. నిలబడ్డ జనం మొహాల్లో ఏదో చిన్న సంతోష రేఖ!

కదలవలసినంత త్వరత్వరగా క్యూలోని జనం కదలడంలేదు. ఏమిటా యింత ఆలస్యం అనుకుంటూ సీతారామయ్య సిగరెట్ వకటి ముట్టిస్తూండగా రెండు చినుకులు మొహంమీద వచ్చిపడ్డాయి. మరోక్షణంలో చినుకులు త్వర త్వరగా పడుతూ వానగా మారిపోయింది. క్యూలోని జనం ముందు

---

● అమావాస్య అర్ధరాత్రివేళ మర్రిచెట్టుమీద కూర్చున్న ఒక దయ్యం ఇంకోదాన్ని అడుగుతోంది :

"అసలు మనుషులనేవాళ్ళు వున్నారంటావా ?"

—ఎమ్. సుశీల, విశాఖపట్నం.



వాళ్ళు ఎవ్వరూ చలించలేదు. సీతారామయ్య కూడా చలించక జేబులోని చేతిరుమాలు తీసి తలపై కప్పుకున్నాడు. ఫిరంగి గుండ్లువచ్చి మీద పడుతున్నా కదలని సిపాయిలా, అట్లాగే నిలబడ్డాడు. 'క్యూ' బహునెమ్మదిగా కదులుతోంది. సీతారామయ్య అంత వానలోనూ సిగరెట్‌కి చేతిని అడ్డుపెట్టుకుని, నేర్పుగా వక దమ్ములాగి, పొగ వదుల్తూ వెనక్కి చూసేడు. వెనకాల తనిందాక చూసిన హెడ్మాష్టర్ లేడు, ఆ స్థానంలో ఎవరో షాహుకార్ గారున్నారు. వారి వెనకాల ఎవరో విద్యార్థి వున్నాడు. పక్కనే వున్న వరండావైపు చూసేడు సీతారామయ్య కుతూహలంగా. అక్కడ వంటరిగా నిలబడి వున్నాడు హెడ్మాష్టర్‌గారు. పాపం వానకి భయపడినట్లున్నారు అనుకున్నాడు సీతారామయ్య. తనెట్లాగా వానలో తడుస్తూ నిలబడ్డాడుకనక ఆయనకి తెస్తేనేం అన్పించింది అతనిలోని మంచితనానికి.

హెడ్మాష్టర్ అటు యిటు దిక్కులు చూస్తున్నాడు. తనవైపు చూస్తే సర్వాలే. తనే అడుగుతాడు. క్యూ కొంచెం కదలింది ముందుకు. సీతారామయ్య ఒక దమ్ములాగి, ముందుకి రెండడుగులు వేసి, పేంట్ జేబులో చెయ్యి పెట్టుకుని, వేళ్ళతో డబ్బుని పట్టుకున్నాడు. తనముందు యింకో అయిదారుగురు వున్నారు. కౌంటర్‌లో ఆయన ఏదో టిక్కెట్లపైన రాస్తున్నాడు. బహుశా సీట్లకి నంబర్లు యిచ్చినట్లున్నారు. చినుకులు వక్కసారిగా పడటం ఆగిపోయేయి. సీతారామయ్య హెడ్మాష్టర్ వైపు చూసేడు. ఆయన బిక్కుబిక్కుమంటూ అట్లాగే వరండాలో నిలబడి వున్నాడు ఒక్కడూ! అందరి మొహాలు చూస్తున్నాడు. అడగడానికి బిడియపడ్తున్నట్లున్నాడు, అనుకున్నాడు సీతారామయ్య. "మీకెన్ని కావాలి?" అన్నాడు హెడ్మాష్టర్‌ని వుద్దేశించి సీతారామయ్య. ఒక్కటి అన్నట్లు చూపుడు వేలు చూపించేడు హెడ్మాష్టర్. "డబ్బిట్లా యివ్వండి తెస్తా." అన్నాడు సీతారామయ్య. హెడ్మాష్టర్ రెండు రూపాయల కాగితం యిచ్చేడు.

'క్యూ' కదిలింది సీతారామయ్య వంతు వచ్చింది. సీతారామయ్య సిగరెట్ అవతల పారేసి, డబ్బులిచ్చి రెండు టిక్కట్లు తీసుకుని చూసుకున్నాడు. టిక్కట్లపైన 34, 35 నంబర్లు వేసి వున్నాయి. ఒక టికెట్ హెడ్మాష్టర్‌కిచ్చి, ఆయనకి రావలసిన అర్ధరూపాయి ఆయనకి యిచ్చేడు సీతారామయ్య. హెడ్మాష్టర్ చిరునవ్వుతో 'థాంక్స్' అంటూ వాటిని తీసుకుని, వరండాలోవున్న రాబోయే చిత్రాల బొమ్మలు చూడసాగించేడు.

---

● "ఒక పెద్దనీగ్రో, చిన్ననీగ్రో కలిసి చేపలుపట్టడానికి నదికి వెళ్ళారు. చిన్ననీగ్రో పెద్దనీగ్రోకు కొడుకవుతాడు. కాని పెద్దనీగ్రో చిన్ననీగ్రోకు తండ్రి కాదు. మరి పెద్దనీగ్రో ఎవరో చెప్పు ?"

"తెలియదు. ఎవరు ?"

"పక్కపేజీ చూడు."

—సురేఖ, శ్రీకాకుళం

సీతారామయ్య టికెట్ నంబర్ చూసుకున్నాడు. తనకి 34 వచ్చింది. టికెట్‌ని జేబులోపెట్టుకుని క్యాంటీన్‌లో 'టీ' తాగి మరో సిగరెట్ తాగుతూ అక్కడున్న రాబోయే చిత్రాల బొమ్మలన్నీ చూసి, 1.50 సీట్లు మేడమీద వుండటంవల్ల మేడమీదకి వెళ్తుండగా, మిత్రుడి సంగతి గుర్తొచ్చింది. పైనుంచే ఓసారి కిందజనాన్ని పరీక్షగా చూసి, అందులో తన మిత్రుడు లేకపోవడంతో చిన్న నిట్టూర్పు విడిచి సీతారామయ్య హాలులోకి వెళ్ళేడు.

ఇంకా ఆట మొదలెట్టడానికి 10 నిముషాలు వ్యవధివుంది. సీతారామయ్య వెళ్ళి తనసీట్‌లో తను కూర్చున్నాడు. తనప్రక్క సీట్‌లో హెడ్మాష్టరు అంతకు మునుపే కూర్చుని వున్నాడు,

తనకి కుడివైపున వుండే కుర్చీలో ఎవరో బహుశా పి.యు.సి. విద్యార్థి అయ్యుంటాడు, కూర్చొనివున్నాడు. అతను రెండువైపులా బల్లలపైన చేతులు ఆన్చుకొని కూర్చున్నాడు. ఎడమవైపు కుర్చీలో వున్న హెడ్మాష్టర్ తను రాగానే తను అంతకుముందు కుడివైపున చేతులు ఆన్చుకున్న బల్లమీదనుంచి ఒకచేతిని తీసేసి, ఎడమచేతిని మాత్రం ఎడమచేతివైపునవున్న బల్లమీదే ఆన్చిఉంచాడు. సీతారామయ్యకి ఏ బల్లపైనా చేతులు ఆన్చకుండా కూర్చోడం అలవాటు. అంచేత ఎడంచేతి వైపున బల్ల ఖాళీగావున్నా దానిజోలికి పోలేదు. కుర్చీలో దర్జాగా ఆనుకుని చుట్టూరావున్న జనాన్ని పరిశీలించసాగేడు సీతారామయ్య.

'సినిమాకి స్త్రీలుకూడా బాగానే వచ్చేరు.... వాళ్ళు ఎప్పుడు ఎట్లా టిక్కెట్లు తీసుకున్నారో' అనుకున్నాడు సీతారామయ్య. మొదటివరసలోని స్త్రీలని చూసి, వెనక అంతా కాలేజీ విద్యార్థుల్లా వున్నారు - గోల గోల చేస్తున్నారు నవ్వులతో, హాస్యాలతో. ఆకస్మికంగా తనవంక ఎవరో నిశితంగా చూస్తున్నట్లు అన్పించి సీతారామయ్య అటుయిటు చూసేడు. హెడ్మాష్టర్ తనవంక అదే పనిగా చూస్తున్నాడు. తను చూడటం గమనించి ఆయన మొహం పక్కకి తిప్పుకున్నాడు. సీతారామయ్య కుర్చీలో ముందుకి జరిగి కూర్చుని రెండోవరసలో తనకి తెల్సిన మనుషులు ఎవరైనా వున్నారా అని ఏం తోచక పరిశీలించసాగేడు. హెడ్మాష్టర్ ఓరగా యింకా తనవైపు చూడటం కనిపెట్టాడు సీతారామయ్య. ఎందుకు చెప్మా తనని అట్లా చూస్తాడు అనుకున్నాడు సీతారామయ్య. కుర్చీలో మళ్ళీ వెనక్కి జేర్లబడ్డాడు సీతారామయ్య. టైం చూసుకున్నాడు. ఇంకో మూడు నిమిషాల్లో మొదలెడతారు ఆట. హెడ్మాష్టర్ ఓసారి తన మొహాన్ని పరిశీలనగా చూసి ఏదో ఆలోచించసాగేడు. సీతారామయ్య హెడ్మాష్టర్ మొహాన్ని, తలని, కళ్ళజోడుని, తొడుక్కున్న చొక్కాని చూసేడు; తనెందుకు ఆయన్ని చూడకూడదని. ఆయన తల నెరిసివుంది. తలమీద ఒత్తుగా లేవు ఆ నెరసిన వెంట్రుకలు. కళ్ళజోడు హనీ కలర్ ఫ్రేమ్, గ్లాసులు రీడింగ్‌వి. ముక్కు కోలగావుంది. కొంచెం తక్కువగా వుంటే అందంగా వుండేదేమో

" తల్లి "



గాని, ఎక్కువగా వుంది. శరీరం చామనఛాయ. చెవులో జుట్టుకూడా వుంది, తొడుక్కున్న చొక్కా పొడుగు చేతులది. - ఖద్దరుది. ఆ పొడుగుచేతుల చివర పాతరకం వాచీఒకటి కూడా కన్పిస్తుంది. పాంటు బిన్నీ డ్రిల్లు. ఆరోజే తీసింది కాదు. నలిగివుంది. కాళ్ళకి హవాయి రబ్బర్ చెప్పులు. బాటావిలాగే వున్నాయి. చెక్కవి కావు. ఇదీ ఆయనవేషం అనుకున్నాడు తనూ ఆయన్ని పరిశీలించేననే సంతృప్తితో. ఇంతలో హెడ్మాష్టర్ నుదుటిని కుడిచేత్తో రాసుకోసాగేడు కాస్సేపు. మరికాస్సేపు చేతివేళ్లు పిసుక్కున్నాడు. మరికాస్సేపు చేతిగోళ్లు కొరుక్కున్నాడు. కుడివేలినున్న ఉంగరాన్ని బయటికి లాగి, మళ్ళీ వేలినిపెట్టి, మళ్ళీ లాగి, వేలికి పెట్టేసుకున్నాడు.

సీతారామయ్య ఇదికూడా గమనించేడు. ఏమిటి ఈయన బాధ అనుకున్నాడు. ఇంతలో లైట్లు ఆరేయ్. సైడు రీల్సు ప్రారంభమయ్యేయి. సీతారామయ్య వుత్సాహంగా సైడ్ రీల్సు చూడసాగేడు. కాని మధ్యమధ్య సీతారామయ్యకి అన్పిపిస్తోనే వుంది. ప్రక్కనున్నాయన ఏదో 'అనీజీ' గా బాధపడ్తున్నాడని, చాలాసేపటివరకు ప్రక్క ఆయన వేళ్ళు నలుపుకుంటూనే వున్నాడు. నుదురు రాసుకుంటూనే వున్నాడు. కాలిజోడుతో నేలను తన్నుతూనే వున్నాడు.

ఆఖరికి ఇంటర్వల్ అయ్యింది. లైట్లు అన్నీ వెలిగేయి. జనంలో సగంమంది లేచి నిలబడి, మిగిలిన జనాన్ని తప్పించుకుంటూ బయటికి రాసాగేరు. సీతారామయ్యకి బయటికి వెళ్ళాల్సిన పనేమీ కన్పించలేదు. అయినా అక్కడవుంటే అటుయిటు వెళ్ళే జనం, కాళ్ళు తొక్కుతారనే భయంతో, తనూ లేచి ఒకరిద్దరి కాళ్ళు తొక్కుకుంటూ బయటికి వచ్చేడు.

బయట చల్లటిగాలి వేస్తోంది. మబ్బులు యింకా భయపెడుతూనేవున్నాయి. సీతారామయ్య సిగరెట్ వకటి వెల్గించుకుని, యిందాక చూసిన రాబోయే చిత్రాల ప్రకటన బొమ్మలు కాస్సేపు చూసి, ఇంకా టైం కాకపోవడం చూసి, టీ స్టాల్ వద్ద ఆగి ఒక టీ త్రాగి, సిగరెట్‌ను ఆఖరిదమ్ము వకటిలాగి, అవతలపారేసి, 'ఎక్స్‌క్యూజ్ మి' అంటూ జనం కాళ్ళు తొక్కుకుంటూ తన సీట్‌లోకివెళ్ళి చతికల పడ్డాడు.

హెడ్‌మాష్టరుగారు సీతారామయ్య వైపు ఓసారిచూసి ఏదో అడగబోయి, మళ్ళీ అడగలేక మొహం ప్రక్కకు త్రిప్పుకుని, నుదుటిని కుడిచేతివ్రేళ్ళతో రాసుకోసాగాడు. సీతారామయ్య హెడ్‌మాష్టర్‌ని చూసి ఏదో అడగాలని అనుకుంటున్నాడని గ్రహించి, "ఏం కావాలి సార్?" అందామనుకుని, సిల్లీగా ఫీలయి మాట్లాడక వూరుకున్నాడు.

లైట్లు ఆరేయి. సీతారామయ్య ప్రక్క కుర్చీలో కూర్చున్న హెడ్మాష్టర్ ఎందుకో దీర్ఘమయిన నిట్టూర్పు వకటి వదిలేడు. సీతారామయ్య కొంచెం చలించేడు. హెడ్మాష్టర్‌గారు ఎందుకో తను లోపలికొచ్చినప్పటినుంచీ బాధపడుతున్నాడు. తనని పలకరించాలని కూడా ప్రయత్నించేడు. ఏమిటో ఆ బాధ? బహుశా తనని ఎక్కడైనా చూసేడా అని ఆలోచిస్తున్నాడా? లేకపోతే తనేమైనా ఆయన వుపకారం కోరుతానని భయపడ్తున్నాడా? ఇదేనిజమై వుండొచ్చును. పెద్దవాడుకదా అని జాలిపడి తను టిక్కెట్టు తెచ్చియిచ్చేడు. టికెట్ ఉత్తపుణ్యానికి తెచ్చియివ్వడని, బహుశా యిందుకు ప్రత్యుపకారం కోరతాడని ఆయన భయపడుతూండవచ్చును. ఆయన ముక్కుకు సూటిగా పోయేమనిషని తనకిదివరకే ఎవరోచెప్పేరు. అందుచేతే క్రిందటిసారి తన బావమరిది ఎస్.ఎస్.ఎల్.సి. యింగ్లీషు పేపర్లు ఆయన

వద్దకి దిద్దడానికి వచ్చేయని తెలిసికూడా తాను ఆయన వద్దకి వెళ్ళలేదు.

ఆట ప్రారంభమయి చాలాసేపయినా హెడ్‌మాష్టర్‌గారి మనసింకా బాగుండలేదని ఆయన కుర్చీలో 'అసీజీ' గా అటు యిటు తిరగడంవల్ల, సీతారామయ్య గ్రహిస్తూనే వున్నాడు. నడుస్తూన్న సినిమా పైన ప్రయత్నం మీద దృష్టి కేంద్రీకరించి చూస్తున్నా, సీతారామయ్య హెడ్‌మాష్టర్ గారి అవస్థను గురించే ఆలోచిస్తున్నాడు. తను అనవసరంగా వుపకారం చేద్దామనుకుని, అపకారం చేసేడా?

సినిమా ఆఖరికి అయిపోయింది. ఏం చూసేడో సీతారామయ్యకే తెలియదు. మళ్ళీ చూడాలి కాబోల్సు యీ ఆటని అనుకుంటూ జనం వెనకాలే బయటికి నడిచేడు. కట్టులోంచి తప్పించుకువచ్చిన కొన్ని రిక్షాలు, హాలుముందు ఆగివున్నాయి.

నిశ్చయం మరచి, రిక్షామీద పోతే బాగుండుననుకుని అటు యిటు చూచేసరికి ప్రక్కనే హెడ్‌మాష్టర్‌గారు కన్పించేరు. తను ఆయన్ని చూడనట్లే నటించి, రిక్షా ఎక్కి వెళ్ళి పోవచ్చును. లేక ఆ జనంలోనే ఎటో అటు కలిసిపోవచ్చును. కాని రాత్రల్లా ఆ అమాయక మానవుడు ఇట్లాగే బాధపడుతూంటాడు కాబోలు. ఆయన బాధ ఏదో శాంతింపచేస్తే ఎంత బాగుండును అనుకుని సీతారామయ్య ప్రక్కకి చూసేడు. హెడ్మాష్టర్‌గారు గొంతు సవరించుకుని, "మేష్టారూ! మీ మేలు మరచిపోలేను. చాలా థాంక్స్." అన్నాడు.

"దానికేం వుందండి? డోన్ట్‌మెన్షన్" అన్నాడు సీతారామయ్య కొంచెం సిగ్గుపడుతూనే!

"మిమ్మల్ని ఎక్కడో యిదివరకు చూసినట్లున్నాను. నన్ను మీ రెరుగుదురా?"

"ఉహూ. మిమ్మల్ని యిదేనండిచూడటం. మాది యీ వూరు కాదు.... కాకినాడ." అని అసత్యమాడేడు సీతారామయ్య.

"ఓహో! అట్లాగా! ఎక్కడో చూసేనని యిందాకటినుంచి ఒకటే ఆలోచన! గుర్తు చేసుకోడానికి బుర్ర అంతా పాడు చేసుకున్నాను. ఈ రోజుల్లో అనుచితంగా ఎవరూ వుపకారం చేస్తారంటే నమ్మలేం చూడండి!"

సీతారామయ్యకి ఏం చెప్పాలో తోచక వెర్రిగా చిన్న నవ్వు నవ్వి వూరుకున్నాడు. ఇంతలో మళ్ళీ చినుకులు ప్రారంభమయ్యేయి. హెడ్మాష్టర్ అక్కడే వున్న ఓ రిక్షావాడిని ఆపి, "మేష్టారూ! మీరు ఎటు వెళ్ళాలి?" అన్నాడు.

సీతారామయ్యకి ఆ హెడ్మాష్టర్ వుండేది గవర్నరుపేటవైపు అని తెల్సు. అంచేత తప్పించుకుందామని నేను హనుమాన్‌పేట వైపు వెళ్తాను. దగ్గరేలెండి. నడిచిపోతాను." అన్నాడు.

"అబ్బే నడవడమెందుకు? మేముండేది సత్యనారాయణపురం. హనుమాన్‌పేట మీదగా పోవచ్చు. ఫర్వాలే. రిక్షా ఎక్కండి మిమ్మల్ని హనుమాన్‌పేటలో దించేస్తాను." అన్నాడు హెడ్మాష్టర్. ఎంత అబద్ధం అనుకున్నాడు సీతారామయ్య.

అనుకుంటూనే హెడ్మాష్టర్‌గారి తృప్తి కోసం, రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు సీతారామయ్య. హెడ్మాష్టర్‌గారు చిదానందంగా నవ్వుతో, చిటపట పడ్తూన్న వాన చినుకుల్లోంచి రిక్షా వేగంగా పోతుండగా, ఏమేమో రాజకీయాల్ని గురించి ఎంతో వుత్సాహంగా మాట్లాడసాగేడు. ఏ చీకూచింతా ఎరగనట్లు.

నవ్వుతూ మాట్లాడుతూన్న మేష్టరుగార్ని చూసిన సీతారామయ్యకి, చుట్టూ వెన్నెల విరిసినట్లే అయింది. ఊరంతా దీపావళి చేసుకుంటున్నట్లే అన్పించింది. □□□



# మైనస్ ఇంటూ ప్లస్

[illegible]దంగా ఉన్న శాంతినుంచి
ఎడంగా తప్పుకుంటాడు మానవుడు
సంచలనం కలిగించే
సమరాంగణాన్నే కోరుకుంటాడు
అందుకే మానవ చరిత్ర అంతా యుద్ధమయం
యుద్ధాలు లేని చరిత్ర చదివితే అర్థవిహీనం
స్వార్థం ఒక ప్రాథమిక శక్తి
క్రౌర్యం మీద అభిరక్తి
అజ్ఞాతంగా మనిషిలో పశువులో సమానం
వైజ్ఞానికులు చెపుతారు దీనిలో నిజం
ఆశయాలూ ఆదర్శాలూ అంగవస్త్రాల లాంటివి
హఠాత్ పవన వీచికకి అట్టే తొలగిపోలవి
అసలైన మనిషి కాస్త అలజడిలో బయట పడతాడు
కనటు కనపడాలంటే పైన కొంచెం కదలించి చూడాలి
అక్కడక్కడ ఓ మహాత్ముని అడుగుజాడ కనపడినా
అటువైపు మళ్ళక అడ్డదారినే గుడ్డిగా పడిపోతాడు
అవివేకానికున్న బలం ఆవేశానికతికి నప్పుడు
ద్విపాదవాహనాలు బద్దీలు తప్పి ప్రమాదించక తప్పదు
అందుకే మానవుడు మానవుడిగా దేవుడిగా రూపొందే యీ ప్రయాణం
అనంత దీర్ఘం, పునఃపునర్వ్యర్థం, బహుయుగ విస్తీర్ణం.

— బాలగంగాధర తిలక్